# బీఆర్ఎస్ పేదలకు భరోసా

- స్థానికుడిని.. ఓటేసి ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ హయాంలోనే సంక్షేమం
- విపక్ష పార్టీల అభ్యర్థులు నాన్‌లోకల్
- సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం
- బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు
- జహీరాబాద్ పట్టణంలో ప్రచారం

జహీరాబాద్, నవంబర్ 21: జహీరాబాద్ పట్టణాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసి మౌలిక సదుపాయలు కల్పించిందని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు తెలిపారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని హమాలీ కాలనీ, రాంనగర్, ఫరీద్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రకటించారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడానికి కేసీఆర్ బీమాతో ప్రతి ఇంటికి ధీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతుబంధును ఎకరానికి రూ. 16 వేలకు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. ఆసరా పింఛన్లు రూ.5,016 పెంపు, దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ ఇవ్వనున్నట్లు మ్యానిఫెస్టోలో పెట్టారన్నారు. అగ్రవర్ణ పేదలకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్యాస్ సిలిండరును రూ.400 ఇస్తామని తెలిపారు. సౌభాగ్య లక్ష్మిలో అర్హులైన పేద కుటుంబానికి చెందిన మహిళకు నెలకు రూ. 3వేలు చెల్లిస్తామన్నారు. కేసీఆర్ ఆరోగ్యరక్షలో అర్హులైనవారికి రూ.15లక్షల బీమా కల్పిస్తామని తెలిపారు. అన్నపూర్ణ పథకంలో సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. మహిళా సంఘాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనే జహీరాబాద్ పట్టణం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించడానికి సీసీరోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించామన్నారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథలో తాగు నీటిని సరఫరా చేశామని తెలిపారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నేను లోకల్ అని, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులు నాన్ లోకల్ అభ్యర్థులన్నారు. స్థానికంగా ఉండి సేవ చేస్తాను.. ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకురాలు పార్వతీరాములునేత మాణిక్ రావుకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు.

**మాణిక్‌రావును గెలిపించాలి**

న్యాల్‌కల్ మండలంలోని ముంగి, మిర్జాపూర్(ఎన్), టేకూర్, ఖలీల్‌పూర్, మల్గి, మిర్జాపూర్(బీ), మెటల్‌కుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రచారంలో రైతుబంధు సమితీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు మల్లారెడ్డి, అమీర్, పీటర్ రాజ్, జగదాంబమాణిక్, మారుతీయాదవ్, ఎంపీటీసీలు విజయలక్ష్మి, శివానందశ్రీపతి, ఆత్మకమిటీ డైరెక్టర్ రాజు, నేతలు రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి, సంతోష్, విఠల్‌రెడ్డి, ఆశోక్, సిద్ధారెడ్డి, వినోద్‌కుమార్, పూర్ణచందర్ ఉన్నారు.


జహీరాబాద్‌లోని రాంనగర్‌లో ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


న్యాల్‌కల్ : ముంగిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జహీరాబాద్‌లోని హమాలీ కాలనీలో కారు గుర్తుకు ఓటేయాలని మహిళలను కోరుతున్న మాణిక్‌రావు


మాణిక్‌రావును సన్మానిస్తున్న ప్రజలు


జహీరాబాద్‌లోని రాంనగర్‌లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న మాణిక్‌రావు


జహీరాబాద్‌లోని హమాలీకాలనీలో మాణిక్‌రావుకు మంగళ హారతి ఇస్తున్న మహిళలు


జహీరాబాద్‌లోని రాంనగర్‌లో కారు గుర్తుకు ఓట్లు వేయాలని మహిళలను కోరుతున్న మాణిక్‌రావు


జహీరాబాద్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

# విభేదాలు సృష్టిస్తున్న కాంగ్రెస్

- రైతుల ముసుగులో అల్లర్లు చేసేందుకు కుట్ర..
- ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పడు ప్రైవేట్ ఫ్యాక్టరీని ఎందుకు ఆధీనంలోకి తీసుకోలేదు
- చెరుకు రైతులకు పెండింగ్ బకాయిలు ఇప్పించాం
- బిల్లులు చెల్లించకపోవడంతో రికవరీ చట్టం అమలు
- టూరిస్టులుగా వచ్చి అల్లర్లు చేసేందుకు కుట్రలు
- డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, కార్పొరేషన్ చైర్మన్లు నరోత్తం, తన్వీర్, శివకుమార్, బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్‌రావు

జహీరాబాద్, నవంబర్ 21 : కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటమి భయంతో చెరుకు రైతుల ముసుగులో ఆందోళన చేస్తున్నారని, చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మాల్కాపూరం శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావుతో కలిసి మాట్లాడారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బీ) గ్రామంలో ఉన్న ప్రైవేట్ ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం గతేడాది చెరుకు రైతులకు రూ. 18 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ. 9కోట్లు మాత్రమే చెల్లించినట్లు తెలిపారు. ఫ్యాక్టరీ యాజయాన్యం పెండింగ్ డబ్బులు చెల్లించక పోవడంతో ప్రభుత్వం రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించినట్లు తెలిపారు. చెరుకు రైతులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

**చెరుకు రైతుల ముసుగులో అల్లర్లు చేసేందుకు కుట్ర**

జహీరాబాద్ ప్రశాంతంగా ఉన్నదని, కొందరు కాంగ్రెస్ నాయకులు అల్లర్లు సృష్టించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జహీరాబాద్‌లో కొందరు టూరిస్టులుగా వచ్చి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. జహీరాబాద్‌కు పెద్ద ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని, కొందరు కావాలని కుట్రలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పని చేసినవారు ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న ఫ్యాక్టరీని ఎందుకు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోలేదని? ప్రశ్నించారు. ఫ్యాక్టరీ యాజమా న్యం రైతులకు డబ్బులు ఇవ్వకపోతే ప్రభుత్వం డబ్బులు ఇప్పించడం జరిగిందన్నారు. చెరుకు రైతులకు డబ్బులు ఇవ్వకపోతే ప్రభుత్వం ఫ్యాక్టరీ ఆస్తులు అమ్మి ఇప్పిస్తామన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం 3 నెలలలోగా రైతులకు పెండింగ్ డబ్బులు చెల్లించకపోతే, డీసీఎంఎస్ చైర్మన్ సొంత ఆస్తులు అమ్మి పెండింగ్ డబ్బులు ఇస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ముగుసులో కొందరు నాయకులు కుట్రలు చేస్తున్నారని, చెరుకు రైతులు ఆలోచన చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, చెరుకు రైతులు పాల్గొన్నారు.

# మెదక్ ఉమ్మడి జిల్లా హాకీ క్రీడాకారుల ఎంపిక

- పోటీలకు హాజరైన 300 మంది క్రీడాకారులు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 21: ఉమ్మడి మెదక్ జిల్లా హాకీ క్రీడాకారుల ఎంపికలు సోమవారం ఐఐటీ హైదరాబాద్‌లోని డీఏవీ పాఠశాలలో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు అండర్ -14, -17 బాలురు, బాలికల విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 300 మంది క్రీడాకారులు ఎంపిక నోటీలకు హాజరయ్యారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటాలన్నారు. క్రీడాకారులునిరంతర సాధన చేయాలని కోచ్‌లు సూచించారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సూచించారు. ఎంపిక ప్రక్రియలో పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ , డీఏవీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకర్, వ్యాయామ ఉపాధ్యాయులు షర్ఫోద్దీన్, జయంతి, రామకృష్ణ, రాజాగౌడ్, మనోహర్, సుభాష్, సురేశ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


అండర్ -14, -17 బాలురు, బాలికల విభాగంలో హాకీ జట్టుకు ఎంపికైన మెదక్ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



# ఫ్యాక్టరీల్లో చెరుకు అమ్ముకోవచ్చు

- సంగారెడ్డి సహాయ 'కేన్' కమిషనర్ రాజశేఖర్

జహీరాబాద్, నవంబర్ 21 : జహీరాబాద్ జోన్‌లోని రైతులు తమకు నచ్చిన ఫ్యాక్టరీకి చెరుకును విక్రయించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లు సంగారెడ్డి షుగర్ అండ్ కేన్ సహాయ కమిషనర్ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఎంఎస్ శివకుమార్, ఢిల్లీ వసంత్ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేసిందన్నారు. జహీరాబాద్ జోన్ రైతులు నచ్చిన ఫ్యాక్టరీలో చెరుకు విక్రయించుకోవాలని ఆయన సూచించారు.

# పంచాయతీ కార్మికుడు మృతి

న్యాల్‌కల్, నవంబర్ 21 : మండలంలోని హద్నూర్ గ్రామ పంచాయతీ కార్మికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై రామానాయుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హద్నూర్ గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న అలిగే శాంతికుమార్ (35) సోమవారం రాత్రి బైక్‌పై టేకూర్‌కు వెళ్తున్న క్రమంలో ముంగి గ్రామ శివారులో రోడ్డుపై ఆగి ఉన్న చెరుకు లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై అక్కడిక్కక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సామేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామానాయుడు వివరించారు.